

చీఫ్ ఎడిటర్: దొండ్లవారు భవ్య (జర్నలిస్ట్)

RNI.No:-APTEL/26/A2902

గ్లోబల్ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

"అతికొద్ది కాలంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన"
"గ్లోబల్ వార్త" జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గాల్లో
రాయచోటి,
రాజంపేట, రైల్వేకోడూరు,
మదనపల్లి, పీలేరు,
తంబళ్ళపల్లి, పుంగనూరు
విలేకరులు కావలెను
వివరాలకు కింద ఉన్న ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.
ఫోన్ నెంబర్స్ - 7093627232, 9392480345, 08562-461571
MAIL ID : globalvarthaindia@gmail.com

సంపుటి 1 | సంచిక 64 | 05 -11-2026 | గురువారం | పేజీలు -4 | వెల-రూ. 5

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాలు లక్ష్యం

సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



గ్లోబల్ వార్త - అమరావతి : రానున్న ఎన్నికల్లో అన్ని జిల్లా పరి షత్, ఎంపీపీ స్థానాలు దక్కించుకోవాలని పార్టీ శ్రేణులకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బుధవారం రాజధాని అమరావతిలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై వారికి ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజ లకు మనం అండగా నిలిస్తే.. వారు మనతోనే ఉంటారని స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల ద్వారా నిరూపిత మైందని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన నేతలు, కార్యకర్తలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతం స్ట్రైయిక్ రేట్ సాధించామని అన్నారు.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లల్లో దక్కిన విజయం.. మన బాధ్యతను పెంచిందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ ఫలితాలు కూటమి సంక్షేమం - అభివృద్ధి - సుపరిపాలనకు గుర్తింపు అని అభివర్ణించారు. స్థానిక ఎన్నికల్లో సీట్లు దక్కించుకోలేని వారికి నామినేటెడ్ పోస్టులతో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో అనుకున్న విధంగానే ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. గుడ్ గవర్నెన్స్.. గుడ్ పాలిటిక్స్ ఇదే కూటమి ప్రభుత్వ విధానం అని తెలిపారు.

కూటమి ప్రభుత్వ కష్టాన్ని గుర్తించిన ప్రజలు..

ప్రజలకు మంచి చేస్తే.. అన్ని స్థాయిల్లోనూ వారు గుర్తిస్తారని.. మన వెన్నంటే ఉంటారని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఈ విషయాన్ని నిరూపించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పడుతోన్న కష్టాన్ని ప్రజలు గుర్తించారని వివరించారు. మంచికి.. మంచి ప్రభుత్వానికి అండ గా ఉంటామని ఈ ఫలితాల ద్వారా ప్రజలు చాటి చెప్పారని అన్నా రు. మరింత చక్కటి పాలనను అందించేందుకు ప్రోత్సహాన్ని ఇస్తూ ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు.

ఈ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైయిక్ రేట్..

పట్టణ స్థానిక ఎన్నికల్లో కూడా 94 శాతం స్ట్రైయిక్ రేట్ సాధించగలిగామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ఓడిపోయిన కొన్ని చోట్ల కూడా కూటమి పార్టీలకు చెందిన రెబెల్సే గెలిచారని గుర్తు చేశారు. స్థానికంగా ఉన్న చిన్నపాటి సమన్వయ లోపాల వల్ల కొన్ని స్థానాలు కొల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ కూటమి పార్టీల అభ్యర్థులు ఘన విజయం సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమం - అభివృద్ధి - సుపరిపాలన ధ్యేయంగా ప్రభుత్వాన్ని నడిపిస్తు న్నామని అన్నారు.

అందుకే చరిత్ర సృష్టించాం..

ఆర్థిక వ్యవస్థ దివాళా తీసినా సంక్షేమాన్ని అందిస్తున్నామని.. మరో పక్క అభివృద్ధి చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరిం చారు. డీఎస్సీతో టీచర్లు రిక్రూట్మెంట్ల సహా జాబ్ క్యాలెండర్ ద్వారా వివిధ శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలతో మమేకం అవుతూ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. అందుకే చరిత్ర సృష్టించామని సీఎం చంద్రబాబు సోదాహరణగా చెప్పారు.

మిత్రపక్షాలను గౌరవించుకోవాలి..

రాష్ట్రానికి.. తమకు న్యాయం

తరువాయి 2లో




ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసు.. నిందితుల నివాసాల్లో ఈడీ సోదాలు

గ్లోబల్ వార్త - హైదరాబాద్

ఏపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకన అక్రమాల కేసులో బుధవారం ఉదయం నుంచి ఈడీ సోదాలు చేస్తోంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్ మధుసూదనరావు నివాసాల్లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌తో పాటు మూల్యాం కనం జరిగిన మంగళగిరి సమీపంలోని హోయ్ ల్యాండ్ రిసార్టులో కూడా ఈ సోదాలు జరిగా యి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 మూల్యాంకన వ్యవహారంపై మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. గ్రూప్-1 మూల్యాంకనంతో సంబం ధం ఉన్న క్యామ్‌సైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల ఆర్థిక లావాదేవీలపై ఈడీ దృష్టి పెట్టిం ది. గ్రూప్-1మూల్యాంకనానికి చెల్లించిన నిధులు, కాంట్రాక్టుల కేటాయింపులు, ఆర్థిక అక్రమాల ఆరోపణలపై విచారణ జరుపుతోంది. 2018 లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 2020 డిసెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. వాటి జవా బు పత్రాలకు డిజిటల్ మూల్యాం కనంతో పాటు రెండు దశల్లో మాన్యువల్ మూల్యాం కనం జరిగినట్లు సిట్ నివేదిక తెలిపింది. మంగళగిరి సమీపంలోని హోయ్‌ల్యాండ్ రిసార్ట్ లో 84 రోజుల పాటు జవాబు పత్రాల మూ ల్యాంకనం జరిగినట్లు సిట్ గుర్తించింది. అర్హత లేని 66 మందితో గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని సిట్ ఆరోపిం చింది. మూల్యాంకనానికి క్యామ్‌సైన్ మీడియా కు రూ.1.14 కోట్లు, డిజిటల్ మూల్యాంకన సంస్థలకు రూ.1.38 కోట్లు చెల్లించినట్లు దర్యాప్తులో వెల్లడించింది. మూల్యాంకన పత్రా ల్లో 287 బార్‌కోడ్ అసమానతలు, 169 స్లిప్పుల్లో కరెక్షన్ ఫ్లూయిడ్ వినియోగాన్ని గుర్తిం చినట్లు సిట్ తన నివేదికలో వెల్లడించింది. 173 మంది సాక్షులను విచారించి, ఫోరెన్సిక్ ఆధారా లను సిట్ పరిశీలించింది. గ్రూప్-1 మూల్యాం కన అక్రమాలపై 2025 ఏప్రిల్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. పీఎస్ఆర్ ఆంజనేయు లు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్ మధు సూదన రావును గతంలోనే అరెస్టు చేశారు. సిట్ దర్యాప్తు నేపథ్యంలో 2026 అక్టోబర్‌లో మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసి తాజాగా సోదాలు నిర్వహించింది.

వైసీపీని ఊడ్చేశారు!... అన్ని జిల్లాల్లో అదే జోరు..!



గ్లోబల్ వార్త - విలేకర్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో టీడీపీ ప్రభంజనం వీచింది. ముఖ్యంగా నూతన చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఏ దశలోనూ గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. చిత్తూరు, తిరుపతి కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీల్లో టీడీపీ విజయధంకా మోగిం చింది. తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి మాత్రం వైసీపీ ఖాతాలో పడింది. అయితే ఇక్క డ అధిక వార్డుల(18)లో కూటమి గెలుపొందడం గమనార్హం. సీఎం సొంత జిల్లా చిత్తూరులోని చిత్తూరు కార్పొరేషన్, కుప్పం, నగరి, పలమనేరు మున్సిపాలిటీల్లో మొత్తం 168 డివి జన్లు, వార్డులుండగా.. 74 ఏకగ్రీవమయ్యాయి. మిగతా 94 డివిజన్లు, వార్డులకు గాను 77 కూట మికే దక్కాయి. మొత్తంగా టీడీపీకి 142, జనసేనకు 6, బీజేపీకి 1 లభించాయి. వైసీపీ 18 చోట్ల గెలిచింది. కుప్పంలో టీడీపీ క్లీన్ స్వీప్ చేసింది. మున్సిపల్ చైర్మన్ పీఠంతో పాటు మొత్తం 32 వార్డుల నూ సొంతం చేసుకుంది. నామినేషన్ల ప్రక్రియలోనే 13 వార్డులు టీడీపీకి ఏకగ్రీవమయ్యాయి. చైర్మన్ స్థానంతోపాటు 19 వార్డులకు ఆదివారం పోలింగ్ జరిగింది. టీడీపీ చైర్మన్ అభ్యర్థి ఎస్.రాజ్‌కుమార్.. 15,536 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 19 వార్డుల్లో కూడా టీడీపీ అభ్యర్థులే గెలిచారు. వీరిలో ఓ స్వతంత్ర అభ్యర్థి కూడా ఉన్నారు. నగరి 40 వార్డులకు గాను ఏకగ్రీవాలతో కలిపి టీడీపీ 31, జన సేన 1 గెలుచుకున్నాయి. వైసీపీ7, ఒక చోట ఇతరులు గెలిచారు. పలమ నేరులో టీడీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి రాజ్యలక్ష్మి 3,475 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇక్కడ 36 వార్డులకు గాను టీడీపీ 26, జనసేన 2, వైసీపీ 7 దక్కించుకున్నాయి.



డీఎస్సీ అభ్యర్థులకు గుడ్‌న్యూస్.. 2,721 పోస్టులతో నోటిఫికేషన్ జారీకి ఛాన్స్

గ్లోబల్ వార్త - అమరావతి

డీఎస్సీ నోటిఫికేషన్‌ను బుధవారం రాత్రికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చా క 2 వేల 721 పోస్టులతో రెండో నోటిఫి కేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం. గత నెల 13వ తేదీన సార్ట్ నోటిఫికేషన్‌ను సీఎం చంద్ర బాబు సర్కార్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ రోజు రాత్రికి పూర్తిస్థాయి నోటిఫికేషన్ ఇచ్చేందుకు విద్యాశాఖ సిద్ధం అవుతోంది. ఇవాళ నోటిఫికే షన్‌లో దరఖాస్తుల స్వీకరణ, పరీక్షల తేదీలు, సిలబస్ గురించి అధికారులు వివరణ ఇవ్వ నున్నారు. ఈ పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లు 931, స్కూల్ అసిస్టెంట్లు (స్పెషల్ ఎడ్యూకేషన్) 255, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 1231, ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యూకేషన్) 304 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఏడాది మెగా డీఎస్సీ ద్వారా 16 వేల 342 పోస్టులను ఏపీ విద్యాశాఖ భర్తీ చేసిన విషయం తెలిసిందే.

అగ్నివీర్‌లకు సర్వీసు కాలం రెండేళ్లు పెంపు
...4లో

వలస కార్మికులందరూ తిరిగి రండి
...4లో



ఆర్నబ్, మురసు ప్రభావంపై ఆరా

ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేశారు. ఆర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంపై మోదీ ఆరా తీశారు. వారం రోజుల వ్యవధిలో రాష్ట్రానికి రెండు తుఫాన్ల తాకిడి నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితి గురించి చంద్రబాబును మోదీ అడిగి తెలుసుకున్నారు. ఆర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో పాటు ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని ప్రధానికి చంద్రబాబు వివరించారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రైతులకు భారీ నష్టం వాటిల్లిందని సీఎం చెప్పారు. అలాగే రహదారులు, విద్యుత్ సరఫరా సహా వివిధ రంగాలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని వెల్లడించారు. రాష్ట్రానికి తగిన సాయం అందించాలని ప్రధానికి ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా.. తుఫాన్ సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం బాగా పని చేసిందని మోదీ ప్రశంసించారు. తుఫాన్ వల్ల వచ్చిన ఇబ్బం దులను నిరంతర అప్రమత్తతతో సమర్థవంతంగా అధిగమించారని సీఎం చంద్రబాబును ప్రధాని కొనియాడారు.



ఏలూరు జిల్లాలో ఫ్లడ్ అలర్ట్.. ప్రజలకు అధికారుల హెచ్చరిక

గ్లోబల్ వార్త - ఏలూరు :

ఏలూరు జిల్లా ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలానికి ఏపీఎస్డీఎంఏ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ వరద హెచ్చరికలను జారీ చేశారు. పెదవాగు నుంచి వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. వేలేరుపాడు మండల పరధిలోని ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలతో వచ్చే ఆకస్మిక వరదలపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పొంగిపొర్లే వాగులు, కాలువలు, రోడ్లు దాటే ప్రయత్నం చేయొద్దని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

పొంగుతున్న వాగులు, వంకలు

ఏలూరు జిల్లాలో ఏడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగుతున్నాయి. కొయ్యలగూడెం నుంచి పోలవరం వెళ్లే రహదారిపై ప్రమాదకర స్థితిలో వరద పొటెత్తుతోంది. మూడు కిలోమీటర్ల మేరకు ఐదు అడుగుల ఎత్తులో రోడ్డును వరద ముంచెత్తింది. పోలవరం వైపు వెళ్లే ప్రధాన రహదారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్లలోకి వరద నీరు చేరింది. వరదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు వెళ్తున్న సిబ్బంది వరద ఉధృతికి తీవ్ర ఇబ్బందులు ఏదుర్కొంటున్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు డిమాండ్ చేశారు.



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ప్రణాళిక : ఏపీ ఎస్ఈసీ

గ్లోబల్ వార్త - అమరావతి : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వ హణకు పటిష్ఠ ప్రణాళిక అమలు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. రాష్ట్రం లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మెజారిటీ ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రకటించారు. మురసు తుఫాన్, వాతావరణ పరిస్థితులపై జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా బుధవారం విజయవాడలో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై ఎస్ఈసీ దిశానిర్దేశం చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాం త వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు అన్ని శాఖల సమన్వ యం తప్పనిసరని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎస్ఈసీ మార్గనిర్దేశం చేశారు.

పోలింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి: మల్లికార్జున

అలాగే, పోలింగ్ సిబ్బంది నియామకం, ఏర్పాట్ల గురించి ఏపీ ఎన్నికల కార్యదర్శి డా. ఏ. మల్లికార్జున మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు 2.52 లక్షల మంది, కౌంటింగ్ కోసం 52 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని వెల్లడించారు. పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాల పోలింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఆయా పరిస్థితుల ఆధారంగా పోలింగ్ కేంద్రాల లోపలా వీడియోగ్రఫీకి అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు. ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా సంబంధిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. ఏపీలో 2.61 కోట్లకు ఓటర్ల సంఖ్య చేరిందని.. మైక్రో లెవెల్ ప్లానింగ్‌తో ఎన్నికలను నిర్వహిస్తామని మల్లికార్జున పేర్కొన్నారు.

పటిష్ఠ ప్రణాళిక అమలు చేస్తున్నాం: డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

స్థానిక సంస్థల ఎన్నికల శాంతిభద్రతలు, పోలీసు బందోబస్తు గురించి ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరించారు. ఎంపీ టీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చేందుకు పటిష్ఠ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. ఒకే దశలో పోలింగ్ జరుగుతున్నందున ఆయా కేంద్రాల వద్ద ప్రజల రద్దీ నివారణకు తగినంతగా పోలీసు బలగాలను మోహరించామని చెప్పుకొచ్చారు. సెక్టార్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికల బరిలో 18,843 మంది అభ్యర్థులు: మైలవరపు కృష్ణతేజ

ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాల గురించి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 9,821 ఎంపీటీసీ స్థానాలకు గానూ 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. మిగిలిన 7,770 ఎంపీటీసీ స్థానాలకు 18,843 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మైలవరపు కృష్ణ తేజ వెల్లడించారు.



మున్సిపాలిటీల్లో పదవుల పండెం!

ఈ నెల 9న డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలు
చిత్తూరు కార్పొరేషన్‌తో పాటు పలమనేరు, నగరిలో ప్రత్యేక సమావేశాలు

గ్లోబల్ వార్త - చిత్తూరు: చిత్తూరు నగరపాలక సంస్థతో పాటు పలమనేరు, నగరి మున్సిపాలిటీల్లో డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 9వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేత నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 9వ తేదీ ఉదయం 11 గంటలకు ఆయా స్థానిక సంస్థల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఎస్ఈసీ ఆదేశించారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన సభ్యులతో నిర్వహించే ఈ సమావేశాల్లోనే డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలను పూర్తి చేయాలని సంబంధిత కలెక్టర్లకు సూచించారు. ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన సమాచారాన్ని కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు బుధవారం నోటీసుల ద్వారా తెలియజేయాలని ఆదేశించారు. అనివార్య కారణాల వల్ల 9వ తేదీన ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోయినా, ఎన్నికల ప్రక్రియ వాయిదా పడినా మరుసటి రోజు అంటే 10వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎన్నికలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, కుప్పం మున్సిపాలిటీలో ప్రస్తుతం డిప్యూటీ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించడం లేదు. అక్కడ పాత పాలకమండలి పదవీకాలం ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో, గడువు ముగిసిన అనంతరం ఎన్నిక నిర్వహించే అవకాశం ఉందని ఎస్ఈసీ వెల్లడించారు. దీంతో చిత్తూరు, పలమనేరు, నగరి స్థానిక సంస్థల్లో డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



ప్రేమ కథలో ఊహించని మలుపు!

ప్రియుడి ఇంటి ఎదుట మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం
మరో యువతిని పెళ్లి చేసుకున్నాడని మనస్తాపం.. 60 శాతానికి పైగా కాలిన గాయాలు

గ్లోబల్ వార్త- కుప్పం:
ప్రేమించిన వ్యక్తి మరో యువతిని వివాహం చేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చిత్తూరు జిల్లా కుప్పం మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ప్రియుడి ఇంటి ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం కుప్పంలోని పీఈఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలికి 60 శాతానికి పైగా కాలిన గాయాలైనట్లు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుప్పం మండలం మార్వాడ గ్రామానికి చెందిన వాసు గతంలో ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పనిచేసేవాడు. ఆ సమయంలో ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రశాంతితో అతడికి పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం క్రమంగా ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. ఆరు నెలల క్రితం వాసు ప్రొద్దుటూరులో ఉద్యోగం మానేసి స్వగ్రామమైన కుప్పంకు తిరిగి వచ్చాడు. ఇటీవల అతడు మరో యువతిని వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలియని ప్రశాంతి బుధవారం మార్వాడ గ్రామానికి చేరుకుంది. వాసు వివాహం చేసుకున్న విషయం తెలుసుకున్న ఆమె అతడితో వాగ్వాదానికి దిగింది. కుటుంబ సభ్యులు సర్దిచెప్పడంతో అక్కడి నుంచి వెనుదిరిగింది. అయితే గురువారం రాత్రి ప్రశాంతి పెట్రోల్ బాటిల్‌తో వాసు ఇంటి వద్దకు చేరుకుంది. ఇంటి ఎదుటే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పి ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ప్రశాంతికి 60 శాతానికి పైగా కాలిన గాయాలైనట్లు వైద్య వర్గాల సమాచారం. ప్రస్తుతం కుప్పం పీఈఎస్ ఆసుపత్రిలో ఆమెకు చికిత్స కొనసాగుతోంది. మరోవైపు బాధితురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలని నిరసనకు దిగారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఇతర వివరాలపై విచారణ కొనసాగుతోంది.



ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

గ్లోబల్ వార్త - నంద్యాల టౌన్,: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. బ్రిక్స్ సుస్థిర జవన శైలి వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని బొమ్మలసత్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈకార్యక్రమాన్ని ఈనెల 7వ తేది వరకు నిర్వహిహిస్తామని, ప్రతి రోజు ఒక కార్యక్రమంపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఆరోగ్యకరమైన జీన శైలి అలవర్చుకోవడం, శారీరక వ్యాయామం, సుస్థిర ఆహార విధానాలు, ప్లాస్టిక్‌కు నో చెప్పడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించడం, పరిశుభ్రంగా, చిరు ధన్యాలను ఉత్పత్తులను పెంచడం, వంటి వాటిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు, సీవో సుబ్బయ్య, ఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో....

(మొదటి పేజీ తరువాయి)

చేయాలనే ప్రజలు కూటమికి పట్టం కడుతున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. మిత్రపక్షాలను గౌరవించుకోవాలి.. కూటమిలోని ఏ పార్టీ అభ్యర్థి అయినా మన అభ్యర్థే అన్నట్టుగా పని చేయాలని కేడర్‌కు సూచించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను మించి జెడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాలను గెలవాలని వారికి దిశానిర్దేశం చేశారు. చిన్నపాటి పొరపాటు కూడా జరగకూడదని.. పూర్తి సమన్వయంతో పని చేయాలని పార్టీ నేతలను ఈ సందర్భంగా అప్రమత్తం చేశారు.

కూటమి ధర్మాన్ని పాటించాలని..

కూటమిలో ఐక్యత ఎంత మాత్రం చెడిపోకూడదని పార్టీ నేతలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కుటుంబంలోనూ.. పార్టీలోనూ... సంస్థల్లోనూ బేధాభిప్రాయాలు ఉంటాయని సోదాహరణగా వివరించారు. కానీ నిర్ణయం తీసుకున్న తర్వాత కట్టుబడి పని చేయాలి... కూటమి ధర్మాన్ని పాటించాలని శ్రేణులకు సూచించారు. పొత్తు ధర్మాన్ని పాటించని వారిని వదులు కోవడానికి కూడా సిద్ధమని ఈ సందర్భంగా ఆయన కుండబద్దలు కొట్టారు.

హింసను ప్రేరేపిస్తున్న గొడ్డలి పార్టీ..

సుపరిపాలనతో సమానంగా పొలిటికల్ గవర్నెన్స్ ఉండేలా చూస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ హింసను ప్రేరేపిస్తోంది.. సంయమనం పాటించాలని పార్టీ కేడర్‌కు సూచించారు. ఓటమి తప్పదని భావించిన ఆ పార్టీ ఉనికిని చాటుకోవడానికి కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతోందని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పారని అన్నారు. ఆ పార్టీ నేతలు సొంత బూత్‌లలోనూ గెలవలేకపోయారని వివరించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జనసేన పార్టీ తరఫున పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఏపీ టీడీపీ, ఏపీ బీజేపీ చీఫ్‌లు పల్లా శ్రీనివాస్, పీవీఎన్ మాధవ్‌తోపాటు పలువురు కీలక నేతలు హాజరయ్యారు.



ఖాకీ చొక్కా మాటున లంచం భాగోతం

రూ.40 వేల లంచం తీసుకుంటూ ఎస్సై పట్టుబాటు
రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

గ్లోబల్ వార్త - ఆదిలాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన ఆకస్మిక దాడిలో బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై రమేశ్ పట్టుబడ్డారు. ప్రమాద కేసులో ఇబ్బందులు లేకుండా చూస్తానంటూ బాధితుడి నుంచి రూ.40 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాం డెడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం మోర్టండి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాద కేసులో తనకు ఇబ్బం దులు లేకుండా చూడాలని ఎస్సైను సంప్రదిం చినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో సహా యం చేసేందుకు ఎస్సై రూ.40 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్సై లంచం డిమాండ్‌తో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యం లో అధికారులు పక్కా ప్రణాళికతో బుధవారం మధ్యాహ్నం ట్రాప్ నిర్వహించారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో బాధితుడి నుంచి రూ.40 వేలు తీసుకుంటుండగా ఎస్సై రమేశ్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు. పోలీస్ శాఖలో చోటు చేసుకున్న ఈ లంచం వ్యవహారం ఆదిలాబాద్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

శాస్త్రవేత్తల కృషిని మరువకూడదు

సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి



గ్లోబల్ వార్త -డోన్: దేశానికి విశేష సేవలందించిన శాస్త్రవేత్తలు, మహనీయుల జీవితాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత గణిత మేధావి శకుంతలాదేవి జయంతిని పురస్కరించుకుని బుధవారం డోన్ పట్టణంలో ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శకుంతలాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె అసాధారణ గణిత ప్రతిభను, దేశానికి తీసుకొచ్చిన గుర్తింపును స్మరించుకున్నారు. అనంతరం మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. శకుంతలాదేవి తన అద్భుతమైన గణన సామర్థ్యంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని, గణిత రంగంలో భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. ఆమె సాధించిన విజయాలు భావితరాలకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధులు, విజ్ఞాన రంగంలో విశేష కృషి చేసిన శాస్త్రవేత్తలు, సమాజ అభ్యున్నతికి పాటుపడిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. వారి ఆశయాలు, ఆలోచనలు, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని సూచించారు. సమాజానికి సేవలందించిన గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం ద్వారా వారి స్ఫూర్తిని భావితరాలకు అందించగలమని మహమ్మద్ రఫి పేర్కొన్నారు.



ఓటర్లకు భద్రత.. పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక నిఘా

సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా
ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలి
ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉన్నతస్థాయి సమీక్ష

గ్లోబల్ వార్త- నంద్యాల: జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి గణియా అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. నవంబరు 5న జరగనున్న జడ్పీ టీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబం ధించి బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల ఉన్నతా ధికారులు పాల్గొన్నారు. నంద్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షోరాణ్ సమీక్షలో పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఇతర అవసర మైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి, ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్సలు



గ్లోబల్ వార్త - కర్నూలు హాస్పిటల్,:

కర్నూలు జీజీహెచ్‌లో ఇద్దరు రోగులకు ఎన్టీఆర్ వైద్యసేవ కింద జనరల్ సర్జరీ రెండవ యూనిట్ వైద్యులు రెండు అరుదైన ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించారు. ఆదోనికి చెందిన 52 ఏళ్ల ఇక్బాల్ బాషాకు డయాఫ్రాగ్మాటిక్ విధానంలో అక్టోబరు 15న శస్త్ర చికిత్స నిర్వహిం చారు. రోడ్డు ప్రమాదం లో గాయపడి ప్లీహానికి తీవ్ర గాయం కావడంతో గూడూరుకి చెందిన 32 ఏళ్ల మాసూం మియాకు అక్టోబరు 1న ల్యాప్రోస్కోపిక్ స్ప్లీనెక్టమీ ఆపరేషన్ నిర్వహించారు. ఈ రెండు అరుదైన ఆపరేషన్లను జనరల్ సర్జరీ యూనిట్-2 చీఫ్ ప్రొఫెసర్ డా.రామకృష్ణ నాయక్ ఆధ్వర్యం లో అసోసియేట్ ప్రొఫెసర్ డా.సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.ప్రణీత్, డా.ప్రశాంతి మత్తుమందు వైద్యులు, పీజీ వైద్యవిద్యార్థులు డా.మనోజ్, డా.తేజ, డా.ఆంచల్, డా.సోమశేఖర్ వైద్యబృందం నిర్వహించారు. సర్జరీ వైద్యులను సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు అభినందించారు. కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, అనస్థీషియా ప్రొఫెసర్ డా.రామశివనాయక్ పాల్గొన్నారు.

పచ్చ పార్టీ చేసిన అరాచకం



కడప జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి గారి అధ్యక్షతన ప్రెస్ మీట్ జరిగింది ఇందులో మాజీ డిప్యూటీ సీఎం అంజాత్ బాషా గారు మైదుకూరు ఇంచార్జి రఘురామి రెడ్డి గారు రాష్ట్ర ంఎ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి సునీల్ కుమార్ నాయకులు కార్యకర్తలు పాలుగొన్నారు
అంశం : స్థానిక సంస్థల ఎన్నికల గురించి పచ్చ పార్టీ చేసిన అరాచకం గురించి జిల్లాలో ఎంత గోరంగా పరువు తీసారో అది రాష్ట్రానికి తెలిసిపోయింది. మొత్తం నామినేషన్ నుంచి నిన్నటి ఫలితాలవరకు అంత దౌర్జన్యమే. అధికారులు పోలీసులు ఇంత గోరం చేసిన ప్రజలు మాకు సహకరించారు సహకరించిన ప్రతి ఒక్కరికి మా ధన్యవాదాలు ఈ సందర్భంగా కష్టపడి శ్రమించిన ప్రతి ఒక్క కార్యకర్తకి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతూ మీ సేవలు మరచిపోము అని తెలియజేసారు

నేను పోటీ చేసుంటే, మాకు భారీ మెజారిటీ వచ్చేది: ట్రంప్



అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలపై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓటమికి తమ పార్టీనే కారణమని ఆయన పేర్కొన్నారు. ఆ ఎన్నికల్లో తాను పోటీచేసుంటే, తమ పార్టీ భారీ విజయం సాధించి ఉండేదని అన్నారు. తాజాగా వెలువడిన ఫలితాలను అంగీకరిస్తున్నానని తెలిపారు. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టు చేశారు.

డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తా

టెక్సస్, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, ఓహియోలోని సెనేట్లలో డెమోక్రాట్లు విజయం సాధించారు. ఈ సీట్లలో ట్రంప్ స్వయంగా ప్రచారం చేసినా తన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులను గెలిపించలేక పోయారు. తాను పోటీ చేయకున్నా బ్యాలెట్ పేపర్‌పై తాను ఉన్నట్లు ఊహించుకొని, తమ అభ్యర్థులకు ఓటు వేయాలని ఓటర్లను ట్రంప్ అభ్యర్థించారు. కాగా.. మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత న్యూయార్క్ టైమ్స్‌కు ట్రంప్ ఇంటర్వ్యూ ఇచ్చారు. తమ ఓటమిని పూర్తిగా అంగీకరిస్తున్నానని ఆయన చెప్పారు. డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తానని, అందుకు తాను చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నామని తెలిపారు. తనకు ఉన్న వీటో అధికారాలతో వచ్చే రెండేళ్లలో ప్రభుత్వాన్ని నడుపుతా నని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాలో పేరులేని వారు ఫాం 6 ద్వారా అప్లై చేసుకోవచ్చు : ఈసీ

ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ తర్వాత పబ్లిష్ అయిన ఓటరు జాబితాలో పేరు కోల్పోయిన వారు ఫాం 6 ద్వారా కొత్తగా అప్లై చేసుకోవచ్చని ఎన్నికల సంఘం (ఈసీ)తెలిపింది. అలాంటి వారు అంతకుముందు ఓటర్లుగా నమోదై ఉన్నా కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈనెల 3న లేఖ రాసింది. ఫాం 6 ద్వారా కొత్తగా అప్లై చేసినా.. చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోబోమని, అలా దరఖాస్తు చేసినంత మాత్రాన తప్పుడు డిక్లరేషన్ ఇచ్చినట్లు కాదని ఈసీ వివరించింది. కాగా.. కొత్తగా విడుదల చేసిన ఓటరు జాబితాలో పలువురు ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయి. దీంతో అలాంటి వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి సందేహిస్తున్నారు. ఫాం 6 ద్వారా అప్లై చేస్తే తమను ఓటరు జాబితాలో మొదటిసారిగా చేరుస్తారన్న సందేహం వారిలో నెలకొంది. ఈ నేపథ్యంలో ఈసీ క్లారిటీ ఇచ్చింది.ఓటరు జాబితాలో పేరు లేని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే నని, ఇలా చేయడం వల్ల ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని, వారు పాత ఓటర్లు అయి ఉన్నా కూడా ఇబ్బందులు ఉండవని ఈసీ స్పష్టం చేసింది. సెక్షన్ 31 కింద ఎలాంటి చర్యలు తీసుకోరాదని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, దరఖాస్తుదారులు మరో పార్లమెంటరీ నియోజక వర్గం లోగానీ, అసెంబ్లీ నియోజకవర్గంలో గానీ ఓటరుగా నమోదై ఉండకూడదని ఈసీ తెలిపింది. కాగా.. సర్ ప్రక్రియ తర్వాత విడుదల చేసిన ఓటర్ల జాబితాలో చాలా మంది ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని భారీగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈసీ ఈ మేరకు ఒక క్లారిటీ ఇచ్చింది.



తోటి జర్నలిస్టుకు మనమంతా అండగా నిలుద్దాం.. మానవత్వాన్ని చాటుకుందాం!

కడప జిల్లాలో సీనియర్ జర్నలిస్టుగా, ఎలక్ట్రానిక్ మీడియాలో సీనియర్ కెమెరామెన్‌గా సుపరిచితులైన వెంకటేష్ ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు.బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన ఆయన ప్రస్తుతం కడపలోని గణేష్ న్యూరో కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలుస్తోంది. ఎన్నో సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో ఉంటూ తన కెమెరా ద్వారా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చిన వెంకటేష్.. ఈరోజు తన జీవితంలో అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ఆరోగ్య సమస్యలు.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు.. ఈ పరిస్థితుల్లో ఆయనకు మనందరి అండ ఎంతో అవసరం. కడప జిల్లాలోని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు మిత్రులు, ఆయనకు ఆత్మీయులైన ప్రతి ఒక్కరూ దయచేసి స్పందించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. ఆయనను ఒక్కసారి పరామర్శించండి. మీకు చేతనైన ఆర్థిక సహాయం అందించండి. మీ పలకరింపు, మీ ఆప్యాయత, మీ సహాయం ఆయన కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇస్తాయి. ఈరోజు ఆయనకు కష్టం వచ్చింది.. రేపు మనలో ఎవరికైనా రావచ్చు. కష్టకాలంలో ఒకరికొకరం అండగా నిలబడటమే నిజమైన మానవత్వం... వెంకటేష్ త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం. మనమంతా కలిసికట్టుగా ఆయనకు అండగా నిలుద్దాం.మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపిద్దాం.. దయచేసి స్పందించండి.

ఎనిమిది ప్రభుత్వ శాఖలకు సంబంధించి ప్రాథమికంగా నష్టం

మురసు తుపాను కారణంగా రాష్ట్రంలోని ఎనిమిది ప్రభుత్వ శాఖలకు సంబంధించి ప్రాథమికంగా రూ.343.95 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సీఎం చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. ఈ మొత్తం నష్టంలో దాదాపు 94 శాతం వ్యవసాయ రంగానిదేనని వెల్లడించారు. తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వ్యవసాయ రంగానికి జరిగిన నష్టాన్ని భర్తీ చేయడంతో పాటు బాధిత కుటుంబాలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని వివరించారు. వరుస తుపాన్లతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించాలని, నష్టాన్ని అంచనా వేసి తక్షణమే ఆర్థిక సహాయం విడుదల చేయాలని అమిత్ షాను సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి అందే సహాయం బాధిత రైతులకు, ప్రజలకు ఉపశమనం కలిగించడంతో పాటు రాష్ట్రంలో పునరుద్ధరణ, సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు దోహదపడుతుందని లేఖలో పేర్కొన్నారు.



నీట్ పీజీ ప్రవేశాల్లో ర్యాంకుల ఆధారంగా సీట్లు!

2027 నుంచి అమలుకు ప్రతిపాదన

నీట్ పీజీ, నీట్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశాలకు 2027 నుంచి కొత్త విధానాన్ని అమలు చేసే అవకాశం ఉంది. ఆ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రస్తుతం అమల్లో ఉన్న పర్సంటైల్ ఆధారిత అర్హత విధానానికి బదులుగా ర్యాంకుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పించాలని 12 మంది సభ్యులతో కూడిన కమిటీ సిఫారసు చేసింది. ఈ మేరకు తాను రూపొందించిన నివేదికను ఆ కమిటీ ఈనెల 3న సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఆ ప్రతిపాదనకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. 2027 నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదించినప్పటికీ, ఇందుకు సంబంధించిన పూర్తి విధివిధానాలను ఖరారు చేయాల్సి ఉంది.పీజీ మెడిసిన్‌లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు కనీస అర్హత ప్రమాణాలను తగ్గించడం సరికాదని కమిటీ స్పష్టం చేసింది. సీట్లు మిగిలిపోతున్నాయన్న ఒకేఒక్క కారణంతో ప్రవేశ అర్హత ప్రమాణాలకు పూర్తిగా రిలాక్సేషన్ ఇవ్వడం సరికాదని సూచించింది. అలాగే నాన్ క్లినికల్ పీజీ కోర్సుల ఫీజులను తగ్గించాలని, ప్రీ క్లినికల్, పారాక్లినికల్ విభాగాలను ఎంచుకునే అభ్యర్థులకు సర్వీస్ బాండ్ల నుంచి మినహాయింపు ఇవ్వాలని సిఫారసు చేసింది. కౌన్సెలింగ్‌లో జాప్యాన్ని నివారించడంతోపాటు, పీజీ మెడికల్ సీట్లు ఖాళీగా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ నివేదికపై తమ అభిప్రాయాలను సమర్పించేందుకు పిటిషనర్లకు సుప్రీంకోర్టు గడువు ఇచ్చింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఏంటీ వివాదం?

కౌన్సెలింగ్ ప్రక్రియలో పీజీ మెడికల్ సీట్లు భారీగా మిగిలిపోతుండటంతో నీట్ పీజీ అర్హత కటాఫ్‌ను పలుమార్లు తగ్గించడంతో వివాదం మొదలైంది. 2023లో అన్ని కేటగిరిల అభ్యర్థులకు అర్హత పర్సంటైల్‌ను సున్నాకు తగ్గించారు. దీంతో నెగెటివ్ మార్కులు వచ్చిన వారికి కూడా కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం వచ్చింది. 2024లోనూ కటాఫ్ తగ్గించారు. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 15 పర్సంటైల్, రిజర్వ్‌డ్ కేటగిరిలకు 10 పర్సంటైల్‌గా నిర్ణయించారు. 2025-26 ప్రవేశాల సమయంలోనూ ఇదే పరిస్థితి వచ్చింది. 2026 జనవరి 13న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) మూడో విడత నీట్ పీజీ కౌన్సెలింగ్ కోసం అర్హత కటాఫ్‌ను సవరించింది.

జనరల్ కేటగిరి అభ్యర్థులకు 50 పర్సంటైల్ నుంచి 7 పర్సంటైల్‌కు, జనరల్ పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 45 పర్సంటైల్ నుంచి 5 పర్సంటైల్‌కు తగ్గించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు 40 పర్సంటైల్ నుంచి సున్నాకు కుదించింది. దీంతో నెగెటివ్ మార్కులు వచ్చిన అభ్యర్థులు కూడా కౌన్సెలింగ్‌లో పాల్గొనే అర్హత లభించింది. పీజీ మెడికల్ సీట్లు ఖాళీగా మిగిలిపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కటాఫ్ తగ్గింపు కారణంగా అదనంగా 95,913 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అర్హత సాధించినట్లు సుప్రీంకోర్టుకు సమర్పించిన గణాంకాలు వెల్లడించాయి. అయితే, అర్హత ప్రమాణాలను ఇంత భారీగా తగ్గించడం వల్ల వైద్యవిద్య నాణ్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, ప్రవేశాల విధానంపై సమగ్ర సమీక్ష చేపట్టారు.



హక్కుల గురించి బాలికలు అవగాహన పెంచుకోవాలి

గ్లోబల్ వార్త - కర్నూలు లీగల్, సమాజంలో అన్యాయాలకు గురి కాకుండా ఉండాలంటే బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార చట్టం దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ సమీపంలోని బాలికల ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్‌లో న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ నెల 9వ తేదీన జరిగే న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ న్యాయ సేవాధికార చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ సేవా దినోత్సవం ప్రత్యేక తను, సైబర్ చట్టాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత బాలికల పోషకాహారం పై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ మెంబర్ డా. రాయపాటి శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్లు బెన్నమ్మ, శైలజ పాల్గొన్నారు.



తిరుమల అవ్వాచారికోనలో దూకేశాడు

గ్లోబల్ వార్త - తిరుమల

తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డులోని అవ్వాచారికోనలోకి గుర్తుతెలియని వ్యక్తి దూకాడు. మోకాళ్లమిట్ట సమీపంలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. సాంకేతిక లోపంతో ఘాట్‌రోడ్డులో నిలిచిపోయిన ఓ వాహనాన్ని ఆటోమొబైల్ వాహనం తీసుకెళుతున్న క్రమంలో గోడపై నుంచి లోయలోకి దూకుతున్న సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తిని సిబ్బంది గుర్తించారు. వెంటనే కేకలు వేస్తూ వాహనాన్ని నిలిపి అక్కడికి చేరుకున్నారు. అప్పటికే లోయలోకి దూకిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. అయితే లోయ లోతు తక్కువగానే ఉన్న క్రమంలో ఫారెస్ట్, ఫైర్, విజిలెన్స్ సిబ్బంది కిందికి దిగి ఆ వ్యక్తి కోసం గాలించారు. మధ్యాహ్నం వరకు కన్పించక పోవడంతో దూకిన వ్యక్తి మరో మార్గం నుంచి పైకి వచ్చి ఉంటాడని అధికారులు అంచనా వేస్తున్నారు. పైగా లోయవైపు కాకుండా చిన్నపాటి లోతున్న వైపు దూకిన క్రమంలో తిరిగి పైకి వచ్చేయవచ్చని అధికారులు తెలిపారు.

నేడు పరిషత్ పోలింగ్

బరిలో 1,317 మంది అభ్యర్థులు
2004 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
విధుల్లో 11వేల సిబ్బంది

గ్లోబల్ వార్త - శ్రీకాకుళం

జిల్లాలో గురువారం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో 30 జడ్పీటీసీ స్థానాలకు 95 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఇక 542 ఎంపీటీసీ స్థానాలకుగాను... 19 ఏకగ్రీవమయ్యాయి. 523 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు 1,222 మంది బరిలో నిలిచారు. మొత్తంగా పరిషత్ పోరులో 1,317 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 16,20,965 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 8,04,745 మంది ఉండగా, వారి కన్నా అధికంగా 8,16,164 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మరో 56 మంది ఇతరులు నమోదయ్యారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

జిల్లావ్యాప్తంగా మొత్తం 2,004 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 449 సమస్యాత్మక, 308 అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా పోలీసులు గుర్తించారు. ఎన్నికలు, నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరిగేందుకు వీలుగా 757 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించారు. పోలింగ్ నిర్వహణకు 31 మంది రిటర్నింగ్ అధికారులు, 33 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు, 191 మంది జోనల్ అధికారులు, 310 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. బూత్‌ల స్థాయిలో 2220 మంది పీవోలు, 8898 మంది ఇత పోలింగ్ సిబ్బందితో సహా మొత్తం 11,118 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనున్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో అధికారులు, సిబ్బందికి బ్యాలెట్‌బాక్సులు, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. సాయంత్రం వారంతా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక బస్సులు, వాహనాల్లో చేరుకున్నారు.

నాలుగు కేంద్రాల్లో లెక్కింపు

పోలింగ్ ముగిసిన అనంతరం ఈ నెల 7న ఓట్ల లెక్కింపు కోసం జిల్లాలో నాలుగు ప్రధాన కేంద్రాలను ఎంపిక చేశారు. చిలకపాలెంలోని శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాల, టెక్కలి ఐతం ఇంజనీరింగ్ కళాశాల, పలాస ప్రభుత్వ హైస్కూల్, పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. వీటిలో 71 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయగా, లెక్కింపు ప్రక్రియ కోసం 658 మంది సూపర్‌వైజర్లు, 2073 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని.. ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. 'గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఓటర్లు సమయపాలన పాటించాలి. ఓటుహక్కును వినియోగించుకుని స్థానిక సంస్థల బలోపేతానికి తోడ్పడ్డాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఎన్నికలను నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బలగాలు మోహరిస్తాయి. 757 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తామ'ని కలెక్టర్ తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



1800 మందితో బందోబస్తు : ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

జిల్లాలో గురువారం జరగనున్న ప్రాదేశిక ఎన్నికల పోలింగ్‌కు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు పూర్తిచేశామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లాలో 2004 పోలింగ్ కేంద్రాల వద్ద 1,800 మందితో పోలీసు బందోబస్తు సిద్ధం చేశాం. ఇద్దరు ఏఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 40 మంది సీఐలు, 65మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఎన్నికల విధుల్లో పాల్గొనున్నారు. అతి సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాం. రూట్‌మొబైల్స్, సైకింగ్‌ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్‌ఫోర్స్, క్విక్ రెస్పాన్స్, రిజర్వ్ పార్టీలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు అందుబాటులో ఉంచాం. డ్రోన్, సీసీ కెమేరాలతో నిఘా పెట్టాం. చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేశాం. నగదు, మద్యం పంపిణీలు అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాం. పోలీస్‌యాక్ట్ 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉన్నందున ప్రజలు అనవసరంగా గుంపులుగా ఉండరాదు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత నడుమ స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలిస్తామ'ని ఎస్పీ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అనుమాన కార్యకలాపాలు, సమస్యలపై కంట్రోల్‌రూమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, వదంతులు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంట్రోల్‌రూమ్ నెంబర్లు

జిల్లా పోలీసు కార్యాలయం - 63099 90933
జిల్లా పోలీసు ఎన్నికలసెల్ - 63099 90923
శ్రీకాకుళం డీఎస్పీ - 63099 90804
కాశీబుగ్గ డీఎస్పీ - 63099 90805
టెక్కలి డీఎస్పీ - 63099 90811

వరుసగా నాలుగో రోజూ ర్యాలీ



సెన్సెక్స్ 1,225 పాయింట్లు అప్ దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా నాలుగో రోజూ ర్యాలీ కొనసాగింది. మంగళవారం ప్రామాణిక సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీలు దాదాపు 2 శాతం పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో దిద్దుబాటు, విదేశీ నిధులు రావడం ఇందుకు దోహదపడింది. ఫలితంగా బీఎ?సఈ సెన్సెక్స్ 1,225.07 పాయింట్లు (1.62శాతం) పెరిగి డే గరిష్ఠ స్థాయి 76,917.85 వద్ద, ఎన్ఎ?సఈ నిఫ్టీ 370.05 పాయింట్ల (1.58శాతం) లాభంతో 23,810.85 వద్ద క్లోజైంది. మార్కెట్లలో ర్యాలీ నేపథ్యంలో బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.4 లక్షల కోట్లు పెరిగి రూ.486 లక్షల కోట్లకు చేరుకుంది.

ఎన్ఎస్ఈఐఎక్స్ ట్రేడింగ్ సమయం పెంపు: ఎన్ఎస్ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈఐఎక్స్) తన మార్కెట్ ట్రేడింగ్ సమయాన్ని దాదాపు 21 గంటల నుంచి 23.5 గంటలకు పెంచింది. అంతర్జాతీయ పెట్టుబడిదారులకు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మార్కెట్ కార్యకలాపాలు తెల్లవారుజామున 3.15 గంటలకు ప్రారంభమై మర్నాడు ఉదయం 2.45 గంటల వరకు కొనసాగుతాయి. ఇది సోమవారం నుంచే అమల్లోకి వచ్చింది.

బీఎల్ఎస్ పాలిమర్ బంపర్ లిస్టింగ్: బీఎల్ఎస్ పాలిమర్స్ షేర్లు మంగళవారం స్టాక్ మార్కెట్లలో నమోదయ్యాయి. బీఎస్ఈలో ఈ షేరు ఇష్యూ ధర రూ.150తో పోల్చితే 62.73శాతం ప్రీమియంతో 244.10 వద్ద లిస్ట్ అయ్యిం ది. ఇంట్రాడేలో ఏకంగా 90.16శాతం లాభపడి రూ.285.25 స్థాయిని తాకింది. చివరకు 79.5శాతం లాభంతో రూ.269.30 వద్ద క్లోజైంది. ఎన్ఎస్ఈలో ఇష్యూ ధర కన్నా 79.2శాతం లాభంతో రూ.268.80 వద్ద క్లోజైంది



ఆహారంలో చిరుధాన్యాలను వినియోగించాలి

గ్లోబల్ వార్త - శ్రీకాకుళం కల్చరల్ : చిరుధాన్యాల వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందని, ఇదే ఉద్దేశంతో పూర్వీకులు వీటిని తినేవారని, అందువల్ల మన ఆహారాల్లో వీటి వినియోగం పెరగాల్సిన అవసరం ఎంతై నా ఉందని రిమ్స్ సూపరింటెండెంట్ డా.జి.సౌమిని అన్నారు. బ్రిక్స్ సస్టైన బుల్ లైవ్‌స్టైల్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రిమ్స్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆహార భద్రత, పోష కాహారంపై భారతదేశం ప్రపంచానికి నాయకత్వం వహిస్తోం దన్నారు. రాగులు, సజ్జలు, జొన్నలు, అరికెలు, సాములు వంటి చిరుధాన్యాల్లో కాల్షి యం, ఐరన్, ఫైబర్ వంటి మైక్రో న్యూట్రియంట్స్ సమృద్ధిగా ఉంటా యన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, రక్తహీనత, గుండెజబ్బుల నివా రణకు ఎంతో మేలుచేస్తాయన్నారు. వీటితో పాటు నువ్వులు, గుమ్మడి, అవిసె గింజలను తీసుకోవడం వల్ల ఓమేగా-3, రోగ నిరోధకశక్తి పెరుగు తుందన్నారు. వీటిపై రోగులు, వారి సహాయకులకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంవో డా.గోపాల కృష్ణ, సంధ్యారాణి, డైటీషియన్ శివప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రంప్‌నకు ఎదురుదెబ్బ..
మేము కూడా అంటూ కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగలడంపై భారత్ నేతలు కూడా ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. అమెరికాలో డెమోక్రాట్‌ల విజయం కాంగ్రెస్ పార్టీ నేతల్లో కొత్త ఆశలకు చిగురింపచేస్తోంది. భారత్‌లోనూ రాజకీయ మార్పు సాధ్యమేనని కాంగ్రెస్ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'యెస్.. వి కెన్ టూ' (అవును.. మనం కూడా సాధించగలం) అంటూ కాంగ్రెస్ నేతలు ఉత్సాహంగా ఉన్నారు



మదనపల్లెలో వార్ వన్‌సైడ్



గ్లోబల్ వార్త - మదనపల్లె, మదనపల్లె మున్సిపాలిటీలో మంగళవారం వెలువడిన ఫలితాల్లో కూటమి ఘన విజయం సాధించింది. 1961 నుంచి ఇప్పటి వరకూ మున్సిపల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విజయంలో తనదైన ముద్ర వేసుకుంది. 2024 సాధారణ ఎన్నికల తరహాలోనే 2026 మున్సిపోరులోనూ అవే ఫలితాలు పునరావృతం అయ్యాయి. వైసీపీ ఏకావికలం కాగా, ప్రతిపక్ష హోదా కూడా దక్కని పాతాళానికి పడిపోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ తర్వాత 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దాడులు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు, అక్రమ కేసులతో ఆ పార్టీ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. అధికారం ఉందికదా అని అడ్డదారులు తొక్కడం, అడ్డువచ్చిన వారిని కేసులు, దాడులతో దారిలోకి తెచ్చుకోవడం రివాజుగా చేసుకున్నారు. ప్రజలను, ప్రతిపక్ష పార్టీ పార్టీలను ఇబ్బంది పెడితే తర్వాత పరిణామాలు ఎలా ఉంటాయో తెలియజేసేలా ప్రజలు బుద్ధి చెప్పారు.

విజయ పథానికి చేర్చిన అభివృద్ధి..సంక్షేమం

రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆ పార్టీలను విజయ పథానికి చేర్చాయి. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి శ్రీరామ్ చినబాబు కలుపుగోలుతనం, నేతలందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లడం కూడా కలిసొచ్చింది. ఈ అంశాలు ఎన్నికల్లో వార్ వన్ సైడ్ చేశాయి. జిల్లాలోని పుంగనూరు, రాయచోటి మున్సిపల్ ఎన్నికలతో పోలిస్తే మదనపల్లె పురపాలికలో వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కుతుందనుకున్న రాజకీయ పార్టీల అంచనాలు మంగళవారం నాటి ఫలితాల్లో తారుమారయ్యాయి. 2021 మున్సిపల్ ఎన్నికల నాటికి ఇక్కడి మున్సిపాలిటీలో 35 వార్డులు ఉండగా అందులో 15వార్డులను ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను బెదిరించి నామినేషన్ కూడా వేయకుండా అడ్డుకున్నారు. అరాచకాలు చేశారు. కొందరు నామినేషన్లు వేసినా వారిపేరుతో విత్‌డ్రా కూడా చేసి ఏకగ్రీవం చేసుకున్నారు. ఈ క్రమంలో అప్పట్లో 20 వార్డులకు ఎన్నికలు జరగ్గా, పోలింగ్‌లోనూ అవకాశం లేకుండా చేయడంతో కేవలం టీడీపీ రెండు వార్డులకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుత వైసీపీ పరిస్థితి చూస్తే కేవలం 12వార్డులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వార్డుల విభజన అనంతరం మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య 48 పెరగగా, అందులో టీడీపీ అత్యధికంగా 22 వార్డులు, జనసేన ఆరు, బీజేపీ నాలుగు, బీఎస్పీ ఒకటి, స్వతంత్రులు ముగ్గురు విజయం సాధించారు. కూటమి చైర్మన్ అభ్యర్థి జి.శ్రీరామ్ చినబాబుకు 37,832 ఓట్లు, వైసీపీ చైర్మన్ అభ్యర్థి జింకా వెంకటాచలపతికి 28,199 ఓట్లు పోలయ్యాయి. శ్రీరామ్ చినబాబు 9,633 ఓట్ల మెజారిటీ సాధించి మున్సిపల్ చరిత్రను తిరగరాశారు.



ఫోర్జరీ, చీటింగ్ కేసులో సులోచన సహా ముగ్గురికి రిమాండ్

గ్లోబల్ వార్త - మదనపల్లె క్రైం, : ఫోర్జరీ, చీటింగ్ కేసులో లేడీడాన్ కోనేటి సులోచన సహా ముగ్గురు నిందితులకు న్యాయస్థానం మరో 14 రోజులు రిమాండ్ విధించినట్లు టూటౌన్ ఎస్ఐ నాగేశ్వరరావు చెప్పారు. వన్‌టౌన్ పోలీసులు కొన్ని రోజుల కిందట సులోచన, ఆమె కుటుంబ సభ్యులు శ్రీనాథ్, రెడ్డెమ్మ, అనుచరులు మోహన్, శ్రీరాములునాయుడిపై ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో రెడ్డెమ్మ పరారీలో ఉండగా మిగతా నలుగురు జైలులో ఉన్నారు. ఇదిలావుండగా పట్టణానికి చెందిన మార్వారి శ్రీరామ్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు ఇటీవల సులోచనతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, అనుచరులు సహా మొత్తం 12మందిపై ఫోర్జరీ, చీటింగ్, అక్రమ ప్రవేశం, ఆస్తుల ధ్వంసం కేసులు నమోదు చేశారు. ఈ కేసులో జైలులో ఉన్న సులోచన, కడియాల శ్రీరాములునాయుడు, గుండిగల మోహన్‌ను బుధవారం పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు. అలాగే పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.



తిరుమల నడక మార్గంలో ఎన్ఆర్ఐ మృతి

గ్లోబల్ వార్త – చంద్రగిరి తిరుమల శ్రీవారి దర్శనానికి కాలినడకన వెళుతున్న ఓ ఎన్ఆర్ఐ భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. అమెరికాలోని బోర్డెన్ టౌన్‌లో నివసిస్తున్న సింగిరెడ్డి సుర్‌జిత్‌రెడ్డి(53) కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు బయల్దేరారు. మంగళవారం సాయంత్రం చంద్రగిరి మండలంలోని శ్రీవారిమెట్టు మార్గంలో నడిచి వెళుతుండగా 800వ మెట్టు వద్ద గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది ఆయన మృతదేహాన్ని శ్రీవారి మెట్టు



అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్.. సర్వీస్ కాలం రెండేళ్లు పెంపు

అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. అగ్నిపథ్ పథకం సర్వీస్ కాలాన్ని రెండేళ్లు పొడిగించింది. ఈ విషయాన్ని చీఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎన్. రాజా సుబ్రమణి ఇవాళ (బుధవారం) వెల్లడించారు. సాధారణంగా అగ్నివీర్‌లకు నాలుగేళ్ల సర్వీస్ కాలం ఉంటుంది. ఇది పూర్తయ్యాక వీరిలోని 25 శాతం మంది త్రివిధ దళాల శాశ్వత కేడర్‌కు ఎంపిక అవుతారు. అయితే ఎంపిక వ్వని 75 శాతం మంది కోసం అగ్నిపథ్ సర్వీస్ కాలాన్ని కేంద్రం నాలుగేళ్ల నుంచి ఆరేళ్లకు పెంచింది. దీంతో ఆ 75 శాతం అగ్నివీర్‌లకు శాశ్వత కేడర్‌లో చేరేందుకు మరో అవకాశం దొరకనుంది. 2022లో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం మంచి ఫలితాలనిచ్చిందని సుబ్రమణి తెలిపారు.

కాగా నౌకాదళ అగ్నివీర్‌ల మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం నవంబరు 21తో, వైమానిక దళ అగ్నివీర్‌ల మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం డిసెంబరు 21తో, సైన్యం మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం డిసెంబరు 31తో ముగియనుంది. నాలుగేళ్ల క్రితం ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో మొదటి విడతలో 24,400 మంది అగ్నివీర్‌లు చేరారు. ఈ పథకం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ నాలుగేళ్లలో సైన్యంలో సుమారు 2,70,000 మంది, వాయుసేనలో 27,000 మంది, నేవీలో 21,000 మంది అగ్నివీర్‌లుగా నియమితులయ్యారు. అగ్నిపథ్ సర్వీస్ కాలంలో కేవలం ఫిట్‌నెస్‌పైనే దృష్టి పెట్టకుండా.. నైతిక విలువలు, నైపుణ్యాలూ నేర్పిస్తామని సీడీఎస్ జనరల్ ఎన్.ఎన్. రాజా సుబ్రమణి వెల్లడించారు.

ముస్లిం సెనెటర్ తొలి ప్రసంగం.. వాన్స్, ట్రంప్‌పై పంచ్‌లు

సెనెట్ ఎన్నికల్లో మిచిగన్ రాష్ట్రం నుంచి విజయం సాధించిన డెమోక్రటిక్ నేత అబ్దుల్ ఎల్ సయీద్ తన విజయోత్సవ ప్రసంగంలో యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్‌కు చురకలు అంటించారు. ఎన్నికల సందర్భంగా వారు చేసిన విమర్శలనే అస్త్రాలుగా మార్చుకుని సెటైర్లు పేల్చారు. అమెరికాలో తొలి ముస్లిం సెనెటర్‌గా అబ్దుల్ ఎల్ సయీద్ చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రసంగించిన అబ్దుల్ నేరుగా వాన్స్‌పై పంచ్‌లు వేశారు. జేడీని హబీబీ అని సంభోదించారు. కేవలం ముస్లిం అయినందుకు తనను టార్గెట్ చేసినందుకు వారికి దీటుగా జవాబిచ్చారు. 'జేడీ.. హబీబీ.. మీరే నాతో ప్రమాణ స్వీకారం చేయించాలి. రాజ్యంగ పరంగా అది మీ బాధ్యత' అని అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన ట్రంప్‌ను కూడా వదిలిపెట్టలేదు. 'మీకు నా పేరు పలకడం కష్టం కదా. కాబట్టి, జేడీ నాతో ప్రమాణ స్వీకారం చేయించాక మీరు నన్ను సెనెటర్ అని పిల వచ్చు. అప్పుడు ఏఇబ్బందీ ఉండదు' అంటూ ట్రంప్‌నకు చురకలు అంటించారు.

విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం



గ్లోబల్ వార్త – విజయవాడ : నగర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కూటమి పార్టీల మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం సాధించి విజయవాడ మేయర్‌గా ఎన్నికయ్యారు. ప్రజల నుంచి ఆయనకు భారీ మద్దతు లభించడంతో ఏకంగా 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయం తన ఖాతాలో వేసుకున్నారు.

ఈ విజయంతో కూటమి శ్రేణుల్లో.. వంగవీటి అభిమానుల్లో సంబరాలు అంబరాన్నంటాయి. విశేషమేమిటంటే.. రాధాకృష్ణ పుట్టినరోజు నాడే విజయవాడ మేయర్‌గా ఎన్నిక కావడం ఈ విజయానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. మేయర్‌గా ఎన్నికైనట్లు అధికారికంగా ధ్రువీకరణ పత్రం అందుకునేందుకు వంగవీటి రాధాకృష్ణ తన సతీమణితో కలిసి వచ్చారు. ఎన్నికల ఫలితాల్లో ప్రజలు తనపై చూపిన విశ్వాసం, అందించిన అపార మైన మద్దతు తన బాధ్యతను మరింత పెంచాయని ఆయన పేర్కొన్నారు. భారీ మెజారిటీతో విజయాన్ని అందించిన విజయ వాడ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విజయవాడ అభివృద్ధికి కృషి చేస్తా: వంగవీటి రాధాకృష్ణ

మేయర్‌గా ఘన విజయం సాధించిన అనంతరం వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో భారీ మెజారిటీ అందించిన విజయవాడ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయకుండా, నగర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు, సహకారంతో విజయవాడ నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. తనకు ఇంతటి భారీ విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పుట్టినరోజు నాడే మేయర్ పదవి దక్కడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ విజయాన్ని విజయవాడ ప్రజలకు అంకితం చేస్తున్నాననే సందేశాన్ని ఆయన తన మాటల ద్వారా చాటిచెప్పారు.

కొరియా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న

ఒడిశా ప్రభుత్వం: మంత్రి సంధ్యారాణి

గ్లోబల్ వార్త – అమరావతి



ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లోని వివాదాస్పద ప్రాంతం కొఠియా గ్రామాల్లోని ప్రజలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి భరోసా ఇచ్చారు. ఆయా గ్రామాల్లోని ప్రజలను ఒడిశా ప్రభు త్వం భయభ్రాంతులకు గురిచేయడం దారుణమని అన్నారు. ఏపీలో గ్రామస్థాయిలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొఠియా ప్రాంత ప్రజలపై ఒడిశా అధికారులు ఆంక్షలు విధించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధ వారం రాజధాని అమరావతిలో మంత్రి సంధ్యారాణి మాట్లా డుతూ.. గిరిజనులను తీసుకెళ్లి దాచేస్తున్నారని తెలిపారు. ఇది దుర్మార్గమైన చర్య కాదా? అని ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారులను సూటిగా ప్రశ్నించారు.

గిరిజనుల జీవితాలతో చెలగాటమాడుతున్నారంటూ ఒడిశా అధికారులపై మంత్రి గుమ్మడి సంధ్యారాణి మండిపడ్డారు. కొఠియా ప్రాంతంలోని 29 గిరిజన గ్రామాల ప్రజలను చాలా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో గ్రామస్థాయి ఎన్నికలను బహిష్కరించాలని వారిపై ఒత్తిడి తేవ డం బాధాకరమని అన్నారు. అయితే ఎన్నికలను వాయిదా వేయాల్సిన పని ఎలక్షన్ కమిషన్‌దని తెలిపారు. గ్రామాల్లోకి వచ్చి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం? అని ఒడిశా అధికారులను నిలదీశారు.

కొఠియా ప్రాంతంలోని గ్రామాలపై ఎప్పటి నుంచో సుప్రీంకోర్టు స్టేటస్ కో ఉందని గుర్తు చేశారు. కానీ ఈ స్టేటస్ కో ఈ రోజే వచ్చినట్లు ఎందుకు హడా వుడి చేస్తున్నా రంటూ ఒడిశా అధికారుల తీరు పట్ల మంత్రి సంధ్యారాణి తీవ్ర అసహ నం వ్యక్తం చేశారు. ఏపీలో జరిగే ఎన్నికలను బహిష్కరించాలంటూ కొఠియా గ్రామ ల్లోని అభ్యర్థులను బెదిరించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికా రులు, పోలీసులపై ఒడిశా అధికారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు వేయడానికి వీల్లేదంటూ గిరిజనులపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మంత్రి సంధ్యా రాణి అన్నారు. కొఠియా గ్రామాల్లో గత కొన్ని రోజులుగా ఒడిశా అధికారులు హల్‌చల్ చేస్తూ గిరి జనులను భయపెడు తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులు ఓటు వేయడానికి వస్తారనే భయంతో వారి వాహ నాలను స్వాధీనం చేసుకోవటం ఎంత వరకు న్యాయం? అని ప్రశ్నించారు. అమా యక గిరిజనుల స్వేచ్ఛను, వారి ఓటు హక్కును హరించే ప్రయ త్నాలను ఎంత మాత్రం సహించేది లేదని ఒడిశా ప్రభుత్వ అధికారులను హెచ్చ రించారు. గిరిజ నులను భయపెట్టకుండా, వారి హక్కులను గౌరవిస్తూ ప్రజా స్వామ్యబద్ధంగా వ్యవహరించాలని మంత్రి హితవు పలికారు.

అయోడిన్ లోప నివారణపై అవగాహన

గ్లోబల్ వార్త – శ్రీకాకుళం అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధులపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో డా.నరేష్‌కుమార్ అన్నారు. జాతీయ అయోడిన్ డెఫిషియెన్సీ డిజార్డర్స్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా అవగాహనా వారోత్సవాలను బుధవారం నగరం లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోడిన్‌లోపం వల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని, గాయిటర్ రావొచ్చని, మాన సిక వికాస లోపాలు తలెత్తవచ్చన్నారు. దీని నివారణకు అయోడైజ్డ్ ఉప్పును వినియోగించాలని సూచించారు. అయోడిన్‌తో కూడిన ఉప్పును గాలి చొరబడని కంటైనర్‌లో భద్రపరచాలన్నారు. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని కోరారు. అయోడిన్ లభించే గుడ్లు, పాలు, సముద్ర చేపలు తినాలన్నారు. విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా.శివ రంజని, హెచ్ఎం సుజాత, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ అరుణ జ్యోతి, అప్పారావు, సైకాలజిస్టు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన కార్మికులు తిరిగి రావాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అమలవుతున్న వీబీ జీ రామ్ జీ పథకం కింద కార్మికులందరికీ 125 రోజుల పాటు కచ్చితంగా ఉపాధి కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. 'ఇప్పుడు వీబీ జీ రామ్ జీ పథకం అమలవుతోంది. దీని కింద కార్మికులకు కచ్చితంగా ఉపాధి కల్పిస్తాం. కాబట్టి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన కార్మికులంతా తిరిగి బెంగాల్ కు రండి. సొంత రాష్ట్రంలో పని చేసుకుంటూ కుటుంబంతో కలిసి ఉండండి' అంటూ సువేందు అధికారి పేర్కొన్నారు. బుధవారం పంచాయతీ శాఖ సమావేశానికి హాజరైన ఆయన.. వలస కార్మికుల కోసం ఈ పిలుపు నిచ్చారు.

పంచాయతీ శాఖ సమావేశంలో బెంగాల్ సీఎం మాట్లాడుతూ.. వీబీ జీ రామ్ జీ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 22 కోట్ల పనిదినాలను నమోదు చేసే దిశగా పని చేస్తున్నామని అన్నారు. కేంద్రం ఇచ్చిన ఈ టార్గెట్‌ను తాము త్వరలోనే అందు కుంటామని ఆయన ధీమాగా చెప్పారు. ఈ పథకం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.12,000 కోట్ల నిధులు కేటాయించాయని వివరించారు. ఇప్పటి వరకు బెంగాల్‌లో 65.62 లక్షల పని దినాలు నమోదు చేశామని వెల్లడించారు.

తక్షణ ఆర్థిక సాయం అందించాలని

అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ

గ్లోబల్ వార్త – అమరావతి : ఏపీని వరుస తుపాన్లు తీవ్రంగా దెబ్బతీశాయని.. ఈ విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఈ తమేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. గతంలో వచ్చిన 'అర్నబ్' తుపాను నష్టం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోకముందే తాజాగా 'మురసు' తుపాను మరోసారి తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని లేఖలో వివరించారు. వరుస ప్రకృతి విపత్తుల కారణంగా రాష్ట్రంలోని రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తుపాను ప్రభావం అధికంగా ఉందని వెల్లడించారు. ఇప్పటికే ఒక తుపాను కారణంగా నష్టపోయిన రాష్ట్రానికి మరో తుపాను రూపంలో ఎదురైన విపత్తు ఆర్థికంగా మరింత భారంగా మారిందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మురసు తుపాను కారణంగా రాష్ట్రంలోని ఎనిమిది ప్రభుత్వ శాఖలకు సంబంధించి ప్రాథమికంగా రూ.343.95 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సీఎం చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. ఈ మొత్తం నష్టంలో దాదాపు 94 శాతం వ్యవసాయ రంగానిదేనని వెల్లడించారు. తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వ్యవసాయ రంగానికి జరిగిన నష్టాన్ని భర్తీ చేయడంతో పాటు బాధిత కుటుంబాలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని వివరించారు. వరుస తుపాన్లతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించాలని, నష్టాన్ని అంచనా వేసి తక్షణమే ఆర్థిక సహాయం విడుదల చేయాలని అమిత్ షాను సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి అందే సహాయం బాధిత రైతులకు, ప్రజలకు ఉపశమనం కలిగించడంతో పాటు రాష్ట్రం లో పునరుద్ధరణ, సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు దోహదపడుతుందని లేఖలో పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మస్కట్ బాధితురాలు

స్వదేశానికి రప్పించినందుకు కృతజ్ఞతలు



గ్లోబల్ వార్త – హైదరాబాద్ : మస్కట్ నుంచి తనను క్షేమంగా స్వదేశానికి చేర్చినందుకు బాధితు రాలు తుప్పుడు లక్ష్మి మంగళ వారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధి కోసం గత ఫిబ్రవరిలో మస్కట్‌కు వెళ్లిన కొడంగల్ నియోజకవర్గం గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన ఆమె అక్కడే చిక్కుకు పోయారు. ఏజెంట్ తొలుత చెప్పిన దానికి భిన్నంగా పని అప్పగించడమే కాకుండా యజమాని (కఫీల్) ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని స్వదేశానికి పంపిం చేందుకు నిరాకరించారు.



హాఫ్ సెంచరీతో రాణించిన కోహ్లీ

ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో నాలుగు వికెట్ల తేడాతో(డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) భారత్ ఘన విజయం సాధించింది. . టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. అనంతరం వర్షం అంతరాయం కలిగించడంతో టార్గెట్ 32 ఓవర్లలో 143 పరుగులకు కుదించారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(74) అర్ధ సెంచరీతో రాణించడంతో భారత్ 22.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలో నిలిచింది.

మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో న్యూజిలాండ్ తొలుత బ్యాటింగ్ దిగింది. ఈ క్రమంలో భారత బౌలర్ల ధాటికి కివీస్ 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ టిమ్ సీఫర్ట్(38) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గ్లెన్ ఫిలిప్స్(30), టిక్నర్(34), డారిల్ మిచెల్(28), డఫీ(18లి) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. విల్ యంగ్(9), నికోల్స్(9), టామ్ లాథమ్(3), శాంట్నర్(4), స్మిత్(1), జెమీసన్(1) విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 4, గుర్నూర్ బ్రార్ 3, అన్షుల్ కాంబోజ్ 2 వికెట్లతో చెలరేగారు. అనంతరం స్వల్ప లక్ష్యంగాతో బ్యాటింగ్ దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ పరుగులు ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత వన్ డౌన్‌లో వచ్చిన విరాట్ కోహ్లీ(74), కెప్టెన్ శుబ్‌మన్ గిల్(37)తో కలిసి స్కోర్ బోర్డును కదిలించాడు. వీరిద్దరూ కలిసి 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 114 పరుగుల వద్ద నాథన్ స్మిత్ బౌలింగ్‌లో గిల్ పెవిలియన్ చేరాడు. ఈ క్రమంలోనే పలుమార్లు వర్షం అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిల్ పద్ధతిలో టార్గెట్‌ను 32 ఓవర్లలో 143 పరుగులకు కుదించారు. ఈ క్రమంలో ఐదు వికెట్లు కోల్పోయిన భారత్ 22.2 ఓవర్లలో 143 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో డఫీ మూడు వికెట్లు సాధించాడు. జెమీసన్, నాథన్ స్మిత్ చెరో వికెట్ తీశారు.

50 మీ. పిస్టల్‌లో భారత్‌కు స్వర్ణం



దోహా: ఐఎ స్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో మంగళవారం భారత్‌కు ఓ స్వర్ణం, మరో రజతం లభించాయి. 50 మీటర్ల పిస్టల్ ఫైనల్లో రవీందర్ సింగ్, సౌరభ్ చౌదరి, అమన్‌ప్రీత్ త్రయం 1659 పాయింట్లతో పసిడి గెలిచింది. చైనా రజతం, దక్షిణ కొరియా కాంస్యం సాధించాయి. కాగా, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో ఎలవేనిల్ వలవరిన్, సోనం ఉత్తమ్, శాంభవితో కూడిన మహిళల జట్టు 1894.4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజతం దక్కించుకుంది.



ఐపీఎల్ 2027: తెరపైకి మరో ట్రేడ్ డీల్.. రూ.13 కోట్ల స్టార్ క్రికెటర్‌పై సీఎస్కే కన్ను!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే ఫ్రాంచైజీల మధ్య ట్రేడింగ్ వ్యవహారం ఆసక్తికరంగా మారుతోంది. ఇప్పటికే ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ట్రేడ్‌పై భారీ చర్చ జరుగుతుండగా.. తాజాగా మరో కీలక ఆటగాడి పేరు తెరపైకి వచ్చింది. ఇంగ్లండ్ విధ్వంసకర ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి అతడిని ట్రేడ్ చేసుకునే అవకాశాలను సీఎస్కే పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఐపీఎల్ 2026 వేలానికి ముందు లియామ్ లివింగ్‌స్టోన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకంగా రూ.13 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఆ సీజన్‌లో అతడి ప్రదర్శన ఏమాత్రం ఆశించిన స్థాయిలో లేదు. కేవలం రెండు మ్యాచ్‌లు ఆడిన లివింగ్‌స్టోన్ 15 పరుగులు మాత్రమే చేశాడు. పేలవ ఫామ్ కారణంగా మిగిలిన సీజన్‌లో తుది జట్టులోనే కాకుండా ఇంపాక్ట్ ప్లేయర్‌గా కూడా అవకాశం దక్కించుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో అతడిని వదులుకునేందుకు ఎస్ఆర్‌హెచ్ సిద్ధమైనట్లు సమాచారం. దీంతో తమ జట్టులో ఓ విదేశీ ఆటగాడి కోసం సీఎస్కే పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్.. తాజాగా తనకు ఇష్టమైన కెప్టెన్లు ఎవరో వెల్లడించాడు. భారత జట్టుకు తాను కూడా కొంతకాలం సారథ్యం వహించినప్పటికీ.. తన కెరీర్‌లో ఎంతోమంది దిగ్గజ కెప్టెన్ల నాయకత్వంలో ఆడాడు. ముఖ్యంగా సౌరభ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్సీలో ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమయ్యాడు. తాజాగా ఓ కార్యక్రమంలో అభిమాని అడిగిన ప్రశ్నకు సమాధానంగా తన ఫేవరెట్ కెప్టెన్ల పేర్లను వెల్లడించాడు.

'భారత టెస్టు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం ఎలా ఉంది? ఆ బాధ్యతలకు అలవాటు పడటం ఎంత కష్టమైంది? మీ ఫేవరెట్ కెప్టెన్ ఎవరు?' అంటూ సచిన్‌ను ఓ అభిమాని ప్రశ్నించాడు. 'భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవంగా భావించాను. అయితే జట్టును పూర్తిగా నా ఇష్టానుసారం ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఎప్పుడూ ఉండేది కాదు. నాటితో పోలిస్తే ప్రస్తుతం బీసీసీఐ చాలా అభివృద్ధి చెందింది. వృత్తి పరమైన సంస్థగా ఎదిగింది. భారత క్రికెట్ ఆ సమయంలో చాలా క్లిష్టమైన దశను ఎదుర్కొంది. నేను కూడా కెప్టెన్‌గా జట్టుకు కొంతకాలం సేవలు అందించాను. కానీ నా ఫేవరేట్ కెప్టెన్లు మాత్రం సౌరభ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీ' అని సచిన్ వెల్లడించాడు.

ఇక టెస్టుల్లో అదరగొడుతున్న దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమాపై కూడా సచిన్ ప్రశంసలు కురిపించాడు. 'బవుమా పోరాట స్ఫూర్తిని నేను నిజంగా అభినందిస్తాను. ముందుండి జట్టును నడిపిస్తూ దక్షిణాఫ్రికా క్రికెట్‌కు అద్భుతమైన ఫలితాలు అందించాడు. దక్షిణాఫ్రికా ఐసీసీ ట్రైటిల్ గెలవడం ప్రపంచ క్రికెట్‌కు కూడా ఎంతో మంచిది' అని సచిన్ ప్రశంసించాడు.

తొలి వన్డేలో న్యూజిలాండ్ ఆలౌట్..

ఆక్లాండ్ వేదికగా భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి వన్డే జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. భారత్‌కు 186 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు. ఓపెనర్ టిమ్ సీఫర్ట్(38) టాప్ స్కోరర్.

గ్లెన్ ఫిలిప్స్(30), టిక్నర్(34), డారిల్ మిచెల్(28), డఫీ(18లి) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. విల్ యంగ్(9), నికోల్స్(9), టామ్ లాథమ్(3), శాంట్నర్(4), స్మిత్(1), జెమీసన్(1) విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 4, గుర్నూర్ బ్రార్ 3, అన్షుల్ కాంబోజ్ 2 వికెట్లతో చెలరేగారు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA
D.NO. 28-2-22, II FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520002. EDITOR DONDLAVAGU BHAVYA. PH . 08562-461571 APTEL/2025/16480